## బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

నయీంనగర్, నవంబర్ 2: ఐనవోలు మండలం కొండపర్తికి చెందిన టీడీపీ నాయకులు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ నివాసంలో వారికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. సర్పంచ్ రాజమణి బెన్షన్, గ్రామ శాఖ అధ్యక్షుడు సుధీర్ పాల్గొన్నారు.


ప్రచార రథం పూజల్లో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

## బీఆర్ఎస్ గెలుపు కోసం కంకణబద్ధులు కావాలి

ఐనవోలు, నవంబర్ 2: బీఆర్ఎస్ పార్టీని మూడోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం వద్ద వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ ప్రచార రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్త ప్రచార రథాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు లక్ష ఓట్ల మెజార్టీ తగ్గకుండా కృషి చేయాలన్నారు. మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ జయపాల్, స్థానిక సర్పంచ్ కుమారస్వామి, ఎంపీటీసీ కల్పన, మండల కోఆప్షన్ గుంషావళి, ఉప సర్పంచ్ సతీశ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పరమేశ్ పాల్గొన్నారు.


ఎల్లాపూర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

వర్ధన్నపేట/హసన్‌పర్తి, నవంబర్ 2: బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మండలంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీలు కొనసాగిస్తున్నారు. కార్యకర్తలు వార్డుల వారిగా ఎంపిక చేసుకొని ప్రతీ ఇంటికి వెళ్లి పార్టీ కరపత్రాలను అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ చేసిన అభివృద్ధిని వివరిస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అరూరిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వర్ధన్నపేట పట్టణంలో జరిగిన ప్రచారంలో కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, రామకృష్ణ, సిలువేరు కుమారస్వామి, కంజర్ల మహేశ్, కొండేటి సంపత్, హన్మకొండ సుధాకర్, మహేందర్, మహేశ్, నవీన్, భాస్కర్, యాకాంతం పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే అరూరి గెలుపు కోసం గ్రేటర్ 65 డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో పాక్స్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి డివిజన్‌ను అభివృద్ధి చేసిన నాయకుడు అరూరి రమేశ్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మేజారిటీ మూడోసారి గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు కుమారస్వామి, మహేందర్, రాజయ్య, సురేశ్, మహిళలు ఉన్నారు.

## దీప్తికి ప్రధాని మోదీ అభినందన




పర్వతగిరి, అక్టోబర్ 2: పారా ఏసియా గేమ్స్‌లో స్వర్ణం సాధించిన మండలంలోని కల్లెడకు చెందిన జీవంజి దీప్తిని ప్రధానమంత్రి మోదీ గురువారం అభినందించారు. పారా ఆసియా గేమ్స్‌లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులు గురువారం ఢిల్లీలో ప్రధానిని కలిశారు. ఒక్కొక్కరితో మాట్లాడారు. మండలంలోని కల్లెడకు చెందిన జీవంజి దీప్తి పరుగుపందెంలో పాల్గొని స్వర్ణం సాధించగా అభినందనలు తెలిపారు.

## అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలి

వర్ధన్నపేట, నవంబర్ 2: ఎన్నికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్, ఆర్వో అశ్వనీ తానాజీ వాకడే, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల అధికారుల సమావేశంలో మాట్లాడుతూ నేటి నుంచి నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమవుతున్నందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఏఆర్వో విజయ్‌సాగర్, ఆర్ఐ కృష్ణస్వామి, ఎన్నికల డీటీ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

# కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లాలి

- లక్ష ఓట్ల మెజార్టీ సాధనే లక్ష్యంగా పనిచేయాలి
- బీఆర్ఎస్‌కే ప్రజల పూర్తి మద్దతు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్
- వర్ధన్నపేట, హసన్‌పర్తి, ఐనవోలులో కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశాలు


వర్ధన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట, నవంబర్ 2: ఎన్నికల్లో బీఆర్ఎస్ మరోసారి ఘన విజయం సాధించాలంటే కార్యకర్తలు ప్రతి గడపకు వెళ్లాలని పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ 100 ఓట్ల ఇన్‌చార్జిల అవగాహన సదస్సుకు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. అందుకోసం 100 ఓటర్లకు ఒక ముఖ్య కార్యకర్త చొప్పున బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. వార్డులోని పార్టీ నాయకులతో కలిసి బాధ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిన తీరు ప్రజలకు వివరించాలని అన్నారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ రంగాల్లో సాధించిన ప్రగతితో పాటుగా పేదల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను రూపకల్పన చేసినట్లు చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాంత ప్రజలు ఏవిధంగా ఇబ్బందులకు గురయ్యారనేది కూడా ప్రజలకు వివరించాలన్నారు. మరోసారి కాంగ్రెస్‌కు అవకాశం కల్పిస్తే రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా కుంటుపడుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏవిధంగా అన్యాయం చేస్తున్నదో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, ఏఎంసీ చైర్మన్ స్వామి రాయుడు, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

### మూడోసారి ప్రభుత్వం మనదే..

హసన్‌పర్తి: ఈ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కేఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో హసన్‌పర్తి మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు బండి రజినీకుమార్ ఆధ్వర్యంలో మండలంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్ ఇన్‌చార్జిలు, 100 ఓట్ల ఇన్‌చార్జిలు, ముఖ్య కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే అరూరి రమేశ్, రైతు రుణ విమోచన సమితి చైర్మన్ నాగుర్ల వెంకన్న హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఓటర్ వద్దకు వెళ్లి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోలో అంశాలను వివరించాలన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందన్నారు. పార్టీ ఎన్నిక పరిశీలకుడు సత్యప్రసాద్, ఎంపీపీ సునీత, జడ్పీటీసీ సునీత, వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ అంచూరి విజయ్‌కుమార్, పాక్స్ చైర్మన్ జక్కు రమేశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ సుభాశ్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.


ఐనవోలు: గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే అరూరి, డీసీసీబీ చైర్మన్ మార్నేని

### లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యం

ఐనవోలు: ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు లక్ష ఓట్ల మెజార్టీ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మల్లికార్జున గార్డెన్‌లో సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ ఇన్‌చార్జిలు, 100 ఓట్ల ఇన్‌చార్జిలు, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, మండల సమన్వయ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశానికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి హాజరై మాట్లాడారు. కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించాలని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల లీడర్లు ఏమీచేయరని, నియోజకవర్గ ప్రజల మద్దతు పూర్తిగా బీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. కాగా, ఒంటిమామిడిపల్లి, కక్కిరాలపల్లికి చెందిన 50 మంది నాయకులు, యువకులు కాంగ్రెస్, బీజేపీ నుంచి మండల కేంద్రంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ సమక్షంలో పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రజా ఆశీర్వాద సభలో ల్యాండ్ పూలింగ్ ఉండదని హామీ ఇవ్వడం, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అంశాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఎంపీపీ మార్నేని మధుమతి, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ ఉస్మాన్‌అలీ, మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, సొసైటీ వైస్ చైర్మన్లు చందర్‌రావు, బాబు, స్థానిక సర్పంచ్ కుమారస్వామి, ఎంపీటీసీ కల్పన, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ పొన్నాల రాజు, కట్కూరి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, రాజశేఖర్, సురేశ్, రాజు, గుంషావళి, కోమలత, డీకే, నరేశ్ పాల్గొన్నారు.

## వర్ధన్నపేట కాంగ్రెస్ అభ్యర్థికి ఎదురుగాలి

- నల్లబెల్లి ప్రచారంలో అడ్డుకున్న సొంత పార్టీ నాయకుడు
- సైకిల్ అడ్డుపెట్టి ఆ పార్టీ మండల అధ్యక్షుడి నిరసన


కారుకు సొంత పార్టీ నాయకులు అడ్డుగా పెట్టిన సైకిల్

వర్ధన్నపేట, నవంబర్ 2: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి కేఆర్ నాగరాజుకు సొంత పార్టీలోనే ఎదురుగాలి వీస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని నల్లబెల్లికి ఆయన గురువారం సాయంత్రం ముఖ్య నాయకులను కలిసేందుకు వెళ్లారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ బాధ్యులు నాగరాజు కారుకు సైకిల్ అడ్డుపెట్టి గ్రామానికి రావద్దని నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడైన తనకు సమాచారం ఇవ్వకుండా గ్రామానికి ఎలా వస్తావని నిలదీసినట్లు గ్రామస్తులు తెలిపారు. కాంగ్రెస్ నుంచి నమిండ్ల శ్రీనివాస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఆశించాడు. కానీ ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఐపీఎస్ నాగరాజుకు టికెట్ ఇచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా చీలిపోయారు. దీంతో నాగరాజుకు నమిండ్ల వర్గీయులు సహకరించడంలేదు. గురువారం సాయంత్రం నల్లబెల్లికి రాగా పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్న శ్రీకాంత్ తన అనుచరులతో కలిసి అడ్డుకున్నారు. వెనుక వాహనంలో ఉన్న నాగరాజు తన కారును వెనక్కి తిప్పుకొని వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ముందు నాగరాజు వర్గీయులు ఉన్న కారును పాక్షికంగా ధ్వంసం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేరుకొని శ్రీకాంత్, అనుచరులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వర్లు తమపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 'అరూరి'కి మాజీ మావోయిస్టుల మద్దతు

హసన్‌పర్తి, నవంబర్ 2: వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు మాజీ మావోయిస్టులు గురువారం మద్దతు ప్రకటించారు. ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కేఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో కేతపాక ఎల్లేశ్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ డీఎస్పీగా పనిచేసిన వర్ధన్నపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజు ఉద్యోగం చేస్తున్న సమయంలో ఎంతో మందిని భయభ్రాంతులకు గురిచేసి, మావోయిస్టుల నెపంతో ఎన్‌కౌంటర్లు చేసిన వ్యక్తి అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏండ్లుగా పనిచేసిన నమిండ్ల శ్రీనివాస్‌కు ఇవ్వకుండా నాగరాజు డబ్బులు పెట్టి టికెట్‌ను కొనుక్కున్నాడని ఆరోపించారు. ఆయన ప్రజలకు సాయం చేసే వ్యక్తి కాదని, ప్రజలను వంచించే వ్యక్తి విమర్శించారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు తాము మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ మావోయిస్టులు జన్ను సదయ్య, ఆకారపు రాజమౌళి, తిక్క సుధాకర్, కేతపాక సదానందం, మేకల రాజయ్య, చుంచు రవి, పుట్ట రవి, బుంగ రమేశ్, కుమారస్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మావోయిస్ట్ కేతపాక ఎల్లేశ్